
ఈ వారం తెలుగు పుస్తకం

## తిరుమల రామచంద్రగారి

# హంపీ నుంచి హరప్పా దాక

దాదా హయాత్




Title: Hampi Nunchi Harappa Daaka
Author: Tirumala Ramachandra
Subject: BIOGRAPHY
Year of Publication: 2004
Price: USD $ 4.62

తిరుమల రామచంద్రగారి 'హంపీ నుంచి హరప్పా దాక' పుస్తకం మొదటిసారి చేతుల్లో పడుతూనే ఎవరైనా సహజంగా చేసే పని అందులో తమ వూరి పేరేమైనా వుందేమోనని చూడ్డమేనేమో. పుస్తకం నిండా బండ్లకొద్దీ వూళ్ళపేర్లే! అన్ని వూళ్ళ కైఫియత్తులు!

ఎవరికైనా తమవూరిపట్ల ఈ మాత్రం ఆపేక్ష వుండటం తప్పకాదని అందులోని ఓ దృష్టాంతం కనబడుతుంది. ఒకసారి నార్ల వెంకటేశ్వర రావుగారు, "హంపీ చూచి వచ్చాను. ఫతేపూర్ శిక్రీ నన్ను ఇంప్రెస్ చేసినంతగా హంపీ ఇంప్రెస్ చేయలేదు" అనేసరికి తిరుమల రామ చంద్రగారు మనసు చాలా కష్టపెట్టుకున్నారు. "దానికీ దీనికీ పోలిక ఏమిటండీ? ఫతేపూర్ శిక్రీ చెక్కు చెదరకుండా వుంది" అని చెప్పి హంపీ జపాపా ఎన్‌క్లోజర్‌లోని గజశాల, కమలాపురం పొలిమేరలోని లోటస్‌మహల్, ఉగ్రనరసింహ, శిల్పమయమైన హజరా రామస్వామి గుడి, హేమకూట వినాయక విగ్రహం, విఠలస్వామి గుడి అప్పటి శిల్ప వాస్తు సౌందర్యానికి తార్కాణాలుగా నిలిచాయి చాలదా", అని నార్ల వెంకటేశ్వరరరావుగారికి ప్రైవేటు చెప్పేశారు.

'హంపీ నుంచి హరప్పా దాక' చదివితే హంపీ మీద విరహం పుట్టుకొస్తుందెవరికైనా. చూడనివారికి చూసి తీరాలనే ఉబలాటం పుట్టుకొస్తుంది. ఈ పుస్తకం తిరుమల రామచంద్రగారి జీవిత ట్రావెలాగ్. ప్రయాణం ఎక్కడి నుంచి మొదలవుతుంది? ఓ గుండ్రాయి నుంచి మొదలవుతుంది.

అనగనగా ఓ గుండ్రాయి. ఆ గుండ్రాయి వెనకో పెద్ద గాథ! గుండ్రాయేమిటీ, గాథేమిటీ? అందునా సగం విరిగిన ఇనప గుండు. గుండా గుండ్రాయా? గుండే! కానీ, గుండ్రాయిలా వాడుతున్నారు. దేనికి వాడుతున్నారు? ఇంట్లో దేన్నైనా పిండికొట్టడానికో నూరడానికో వాడుతున్నారు.

పచ్చడి నూరుకునే గుండ్రాయికో కథా? ఆ గుండ్రాయనేది నిజానికో ఫిరంగి గుండు. నాటు ఫిరంగిలో దట్టించి పేల్చిన గుండు. హంపీ చరిత్రకు సాక్ష్యం ఆ ఫిరంగి గుండు. ఇంట్లో వాడుకునే గుండ్రాయికే అంత కథ వుంటే మనుషులకు లేకుండా పోతుందా?

తిరుమల రామచంద్రగారిది తాతాచార్ల వారి వంశమట. తాతా చార్లవారనగనే తెలుగువాడికి తప్పని సరిగా గుర్తుకురావలసిన మరోపేరు తెనాలి రామకృష్ణుడిది. రామలింగడని కూడా అంటాం. తిరుమల

రామచంద్రగారు మాత్రం రామకృష్ణుడనే అంటారు. విజయనగర చరిత్ర ఎత్తుకునేసరికి తెనాలి రామకృష్ణుడు ప్రత్యక్షం. విజయనగరంలో తెనాలి రామన మంటప అనే మండపం ఒకటుంది. ఒకసారి కృష్ణదేవరాయలు తెనాలి రామకృష్ణుని మొహం తనకు చూపించవద్దని ఆర్డరేశారు. ఆ మర్నాడు దూరంగా ఓ మండపంలో పెద్ద త్రిపుండ్రం ప్రత్యక్షమైంది. తీరా చూస్తే వీపునిండా నిలువునామాలతో తెనాలి రామకృష్ణుడు! అదేమనడిగితే, "మొహం చూపొద్దన్నారుగా వీపు చూపిస్తున్నా"నని సమాధానం. ఆ తర్వాత షరామామూలే- కృష్ణదేవరాయల వారు అతని తెలివికి మెచ్చి క్షమించాను పొమ్మన్నారు. అందుకే ఆ మండపానికి తెనాలిరామనమంటప అని పేరొచ్చింది.

ఇలాంటి మజేదారు కైఫియతులు ఈ పుస్తకంలో చాలా వున్నాయి. కొన్ని జనం నోళ్ళలో నానినవి. కొన్ని తిరుమలరామచంద్రగారు స్వయంగా చూసినవి.

కృష్ణదేవరాయలదగ్గర గొడుగుపాలుడనే అంగరక్షకుడున్నాడు. రాయలవారికి గొడుగు పడుతుంటాడు కాబట్టి అతనికి గొడుగుపాలుడనే పేరొచ్చింది. ఒకసారి రాయలవారు గుర్రంమీద దూసుకుపోతుంటే ఈ గొడుగుపాలుడు ఆయనకు గొడుగుపట్టి ఎనభైమైళ్ళు గుర్రంతోపాటు పరిగెత్తాడు. అతని సేవకు మెచ్చి రాయలవారు ఏం కావాలో కోరుకొమ్మన్నారు. అతను ఒకరోజు పాటు రాజ్యం కోరుకున్నాడు. కృష్ణదేవరాయల వారతన్ని ఒక రోజుకు రాజును చేశారు. ఆ రోజంతా గొడుగుపాలుడు దానాలు రాత్రింబవళ్ళు చేస్తునే వున్నాడు. కేవలకల్పనాకథ అనిపించే ఈ కథ చెప్పి వూరుకోరు తిరుమల రామచంద్రగారు. దానికి నిదర్శనంగా బళ్ళారి, అనంతపురం జాల్లాల్లోని పెక్కుపొలాల్లో గొడుగు పట్టుకు నిల్చున్న ఒక వ్యక్తి బొమ్మ వున్న నాటిన బండలు కనిపిస్తాయనీ, ఈ భూముల కవుళ్ళకట్టలో గొడుగుపాలుని భూములపత్రాలు అనే కాయితాలుండేవని తెలిపి కొస మెరుపు మెరిపిస్తారు.

తుంగభద్రలో మొసలివేట అనేది మరో ఆసక్తికరమైన కథ. తుంగభద్రలో ఓ మొసలిపడింది. అది పశువుల్నితినేస్తూ, మనుషులమీద దాడిచేస్తూ నానా బీభత్సం సృష్టిస్తోంది. ఎవరూ దాన్నేం చేయలేక పోయారు. అప్పడో తొంబై ఏళ్ళ ముసలవ్వ ఆ మొసలిని చంపే ఉపాయం తనదగ్గర వుందని చెప్పింది. ఎవరూ ఆమె మాట నమ్మలేదు. అయితే చివరికి ఆమెనే అడిగారు. అప్పుడు ముసలవ్వ తన ఉపాయం ఏమిటో చెప్పింది. ఒక మేకపిల్లను చంపి దాని డొల్ల శరీరంలోకి సున్నం కూరాలి. తర్వాత ఆ మేకపిల్లను మొసలికి ఎరగా వేయాలి. అదీ ముసలవ్వ ఉపాయం. ఊరివాళ్ళు ఆమె చెప్పినట్టే చేశారు. మొసలి ఆ మేకపిల్లను తినేసింది. ఆ తర్వాత తుంగభద్రలో అల్లకల్లోలం ప్రారంభమైంది. సున్నం దెబ్బకు పేగులు తెగి మొసలి భయంకరమైన చావు చచ్చింది.

ఇలా హంపీగురించి, ఆ చుట్టు పక్కల ప్రాంతాల గురించి ఎన్నో కథలు చెప్పకొస్తారు తిరుమల రామచంద్రగారు. తాడిమర్రి పాలకుడికి పచ్చడి మెతుకులు పెట్టిన రాఘవమ్మ, దేవదాసీ పద్ధతికి అతీతంగా జీవించిన బసవి నాగమ్మ, క్షణికావేశంలో సోదరుని హత్య చేసి దేశాంతరవాస శిక్షపడినా జనంలో అభిమానం సంపాయించుకున్న పన్నారాజు. రకరకాల వ్యక్తులు. ఒక్కొక్కరిదీ ఒక్కో విచిత్రమైన కథ.

ఇంట్లో పాముల్తో సహవాసం. ఊళ్ళో ప్లేగువ్యాధి వ్యాపిస్తే ఊరిబయట డేరాల్లో వలసజీవితం. ఇలాంటి వాటితో పాటు తిరుమల రామచంద్రగారికి చిన్నప్పడు దారికి అడ్డుగా పడుకుని ఎదురైన పెద్దపులి.ఆ పెద్దపులిని తరమడానికి వ్యూహం పన్ని, బండ్లు దించేసి ఎడ్లను పులి ఎదుట వరుసగా నిలబెట్టిన తాతగారి సమయస్ఫూర్తి

- ఇత్యాది సంఘటనలన్నీ చవులూరేలా చెప్పకొస్తారు. దట్టమైన అడువులుండిన రాయలసీయ ప్రాంతంలో ఒకప్పుడు అడపాదడపా ఎక్కడ పడితే అక్కడ పులులు కనిపించేవి.

తిరుమల రామచంద్రగారిది కామలాపురం అనే నామాంతరంగల కమలాపురం. కడపజిల్లాలో మరో కమలాపురం వుండటం వల్ల దీన్ని కామలాపురం అన్నార్ట. ఈ కామలాపురం విజయనగర సార్వభౌముల అంతఃపురాలకు దగ్గరగా వున్న ప్రాంతం. అందుకే హంపిమీద తిరుమల రామచంద్రగారికి అంతులేని ఆపేక్ష. పాడుపట్టణమైన విజయనగరం గురించి చెబుతూ చిన్నప్పడు తానక్కడ కోటగోడలెక్కడం, వాటిమీదనుంచి జారడం, ఆ ప్రదేశాల తిరుగాడ్డం - చాలా ఆత్మీయంగా వుంటుంది వాటి గురించి రచన. ఎవర్తోనూ చెప్పకుండా ఒకపారి హరిగోలు- అంటే, ఒకరకమైన డింగీ - ఎక్కి తుంగభద్ర ప్రవాహంలో చిక్కుకోవడం. బ్రేకులేని సైకిలక్కి ఏటవాలు దిగుడుదారిలో నడపబోయి ప్రాణం మీదికి తెచ్చుకోవడం - ఇలా హంపిలో జరిగిన చిన్ననాటి అడ్వెంచర్స్ గురించి చెబుతారు. బళ్ళారిలో ఒకప్పడు సుప్రసిద్ధులైన సంఘసంస్కర్త, న్యాయవాది కోలాచలం వెంకటరావుగారి గురించి విపులంగా తెలియజేస్తారు. బళ్ళారికి గాంధీజీ రావడం తిరుమల రామచంద్రగారి మీద గొప్ప ప్రభావం చూపింది.

కొన్నాళ్ళు ఆనెగొందిలో చదువుసాగించాక తిరుపతిలోని సంస్కృతపాఠశాలలో విద్యార్థిగా చేరారు. అదో పెద్ద ప్రస్థానం. నత్తి వుండేది కాబట్టి తోటి విద్యార్థులు ఆటపట్టించేవారు. అయితే తిరుమల రామచంద్రగారు త్వరలోనే పదిమంది మెప్పపొందగలిగారు. దానికి కారణం విద్యార్థి దశలోనే స్వాతంత్ర్యోద్యమంలో చేరడం.

పద్నాలుగేళ్ళ వయసులోనే తిరుపతి టౌన్‌కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. తిరుమల రామచంద్రగారింట్లో పెద్దవారు కూడా కాంగ్రెస్ వాదులే. వారు తిలక్ అనుయాయులు. గాంధీజీ ప్రభావం తిరుమల రామచంద్రగారి మీద పడింది. " విదేశీ వస్త్రదహనం మొదలైన పనులు నాభావాలు కలవారితో కలిసి నిర్వహించాను. నేను ఎలాగూ ఖద్దరు కట్టేవాడిని. ఖద్దరు అమ్మడం కూడా మా కార్యక్రమంలో ఒక భాగం. నా మిత్రులను, ఊర్లో వారిని కూడా ఖద్దరు కట్టండని ప్రోత్సహించడమేగాక, చనువు వుంటే వారి మల్లు పంచెలు వంటి విదేశీ వస్త్రాలను బలవంతంగా లాక్కుని కాల్చేసేవాడిని," అంటారు.ఆ సమయంలో తిరుమల రామచంద్రగారు రాసిన "ప్రేమ పూతా మాతా సుచరితా" అనేది గొప్ప జాతీయగీతం. దాని పూర్తి పాఠం రామచంద్రగారి దగ్గరే లేకపోవడం దురదృష్టమే.

గోవిందరాజస్వామి మహాద్వార గోపురంపైన కాంగ్రెస్ పతాకను ఎగరేసి తిరుమల రామచంద్రగారు ఎస్సై కన్నయ్యనాయుడి దృష్టిలో పడ్డారు. రామచంద్రగారిని రహస్యంగా పిలిచి, "అయ్యోరా! నువ్వు కాంగ్రెస్ సెక్రటరీ అని నాకు తెలుసు. నీపై నిఘా వేసి వుంచాను. నీ చదువేమో నీ పాటేమో! ఎక్కువ పనికి పోతావూ బొక్కలో తోసేస్తా. మీ ప్రిన్సిపాలుకు చెప్పి ఊరికి పంపిస్తా", అని బెదిరించాడు కన్నయ్య నాయుడు.

రామచంద్రగారి మీద ఆ బెదిరింపు పనిచేయలేదు. గాంధీ-ఇర్విన్ ఒడంబడిక విఫలం కావడంతో దేశమంతా సత్యాగ్రహోద్యమం ముమ్మరమైంది. తిరుమల రామచంద్రగారు నమ్మాళ్వార్ కోవెల మీద త్రివర్ణ పతాకం ఎగరేయడమే కాక, "పోలీసు కుక్కలకు భయపడకు", అని చేత్తో రాసిన కరపత్రాలు తిరుపతి పురవీధుల్లో పంచేసరికి పోలీసులు ఆయన్ని పట్టుకున్నారు. ఆయన్నుంచి క్షమాపణ రాబట్టాలని పోలీసులు చేసిన ప్రయత్నం ఫలించలేదు. "అయా! నేను చేస్తున్న పని సత్కార్యమని నా నమ్మకం. కనుక క్షమాపణ గిమాపణ

కుదరదు”- అని తెగేసి చెప్పేశారు రామచంద్రగారు. ఎస్సై కన్నయ్యనాయుడి ఆధ్వర్యంలో పోలీసులు రామచంద్ర గారిని చంద్రగిరి మెజిస్ట్రేటు ముందు హాజరు పరిచారు. “మీ దృష్టిలో నేను నేరస్తుడనేమో కాని నా దృష్టిలో కాదు. నేను మీరు ఆరోపించిన విషయాలన్నీ మాతృభక్తితో దేశం కోసం చేశాను. అలాంటప్పుడు నేను నేరం చేసినవాడినెలా అవుతాను?” అని మెజిస్ట్రేటు ఎదుట సమాధానం చెప్పారు రామచంద్రగారు. ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష విధించాడు మెజిస్ట్రేటు. ఎస్సై కన్నయ్య నాయుడే కన్నీళ్ళు పెట్టుకున్నాడు. “అయ్యవారా! నిన్ను నా డ్యూటీలో ఏందేందో అన్నాను. నువ్వు నా కొడుకుతో సమానం. దాన్నంతా మనసులో పెట్టుకోబాక”, అన్నాడు. త్యాగం ఎంతటి బండరాయినైనా కరిగిస్తుంది మరి.

రామచంద్రగారిని తిరుచిరాపల్లి కారాగారానికి పంపారు. జైల్లో రామచంద్రగారితో పాటు కామరాజ నాడార్, ఉబైదుల్లా, రాజాజీ కార్యదర్శి సుబ్బయ్యర్  కమ్యూనిస్టు నాయకులు గోపాలన్ వంటి హేమాహేమీ లున్నారు. అల్లూరి సీతారామరాజుకు సహాధ్యాయులైన మద్దూరి అన్నపూర్ణయ్యగారు కూడా ఉన్నారు. సీతారామరాజు గురించి రామచంద్రగారితో ఆమన చాలా విషయాలు చెప్పారు. స్కూల్లో సీతారామరాజుకిచ్చిన బ్రిటీష్‌వారి జెండాను ఆయన గుండె దగ్గర గుచ్చుకున్నాడు. “ ఎందుకిక్కడ గుచ్చుకున్నానో తెలుసా? ఈ ప్రభుత్వాన్ని గుండెలో నిండిన కోపంతో ద్వేషిస్తున్నాను” అన్నాట్ట.

తిరుచిరాపల్లి జైల్లో రామచంద్రగారు రవీంద్రుని ‘ఏక్‌ల చలో’ అనే గీతాన్ని సంస్కృతంలోకి తర్జుమా చేశారు. మీరట్ కుట్రకేసులో నిందితుడైన బటకేశ్వర్ దత్‌తో పాటు జీవన్‌లాల్ ఛటర్జీ వంటి కమ్యూనిస్టులుఆయనకు జైల్లో పరిచయమయ్యారు. “ఈసారి నువ్వు ఏ బ్రిటీష్ వాడినైనా  కాల్చి చంపి జైలుకి రా, నేను సంతోషిస్తాను.” అంటూ రామచంద్రలాంటి యువకులను జీవన్‌లాల్ ఛటర్జీ ఉద్రేకపరిచేవాడు. ఆయన ప్రభావంతో తిరుమల రామచంద్రగారు సగం మారిపోయారు.

*‘దీనజన రుధిర చూషణ*
*సక్తానామ్ అధ్యకక్ష సామగ్రే*
*ప్రాణేషు కంఠ గతేష్వపి*
*సనమయ దైన్యేన మస్తకం సుమతే ’*

- దరిద్రుల రక్తాన్ని పీల్చే ధనవంతుల ఎదుట ప్రాణాలు కంఠగతాలైనా తలవంచకు, అంటూ మన సుమతీ శతకంలోని మకుటంతోనే సంస్కృతంలో ఉత్తేజపూరితమైన ఆర్యలు రాసారు.

రామచంద్రగారి మాటల్లోనే చెప్పాలంటే జైల్లో ‘డిటెన్యూలు చేసిన బ్రెయిన్ వాష్’ తరవాత్తరవాత ఆయన జీవితాన్ని పెనుమలుపు తిప్పింది. అదే మద్రాసు కుట్రకేసు.

ఇప్పటి తరంవారికి మద్రాసు కుట్రకేసు గురించి అసలేమీ తెలియదేమో. ఒకవేళ తెలిసినా అది చాలా తక్కువ. దక్షిణ భారత దేశంలో ఇదే మొదటి కుట్ర కేసు. తిరుమల రామచంద్రగారికి ఈ కేసుతో సంబంధం ఉండటంతో తమకు క్రాస్ ఎగ్జామినేషన్‌తో సహా కళ్ళకు కట్టినట్టు చెబుతారు.

మద్రాసు కుట్ర కేసు గురించి చెప్పేటప్పుడు కొంత పూర్వరంగంలోకి వెళ్ళాలి.

జైలునుంచి విడుదలయ్యాక తిరుమల రామచంద్రగారు రాజకీయాల్తో సంబంధం ఉన్నవాడు కాబట్టి తిరుపతి సంస్కృత కళాశాలలో మళ్ళీ ప్రవేశం దొరకలేదు. మిత్రుల సలహాతో రామచంద్రగారు  నెల్లూరు చేరుకున్నారు.

కాంగ్రెసు వాదుల సహకారంతో అక్కడి సంస్కృత కళాశాలలో ప్రవేశం దొరికింది.నెల్లూరులో రామచంద్రగారికి వీరోచిత మర్యాద దొరికింది. నెల్లూరు పెద్దలు వేదం వేంకటరాయశాస్త్రి, దీపాల పిచ్చయ్యశాస్త్రి, దువ్వూరి రామిరెడ్డి, పఠాభి, షేక్‌దావూద్ సాహెబ్, ఆచార్య ఆత్రేయ, 'జమీన్‌రైతు' వెంకటరామాంజనేయులు, పుచ్చలపల్లి సుందరయ్య, పాటూరు సుబ్బరామయ్య వంటి మహామహులతో పరిచయం ఏర్పడింది. అయితే నెల్లూరులో ఆయనకు పగటిపూట ఒక జీవితం, రాత్రిపూట మరోజీవితం.

తిరుచిరాపల్లి జైల్లో పరిచయమైన ఆళ్ళ బాలకృష్ణారెడ్డి, పట్టాభిరామిరెడ్డి, కాళయ్యశెట్టివంటివారు తిరమల రామచంద్రను నెల్లూరులో కలుసుకున్నారు. వీరు నెల్లూరు వాళ్లే. దౌర్జన్యకారులని పేరుపడ్డారు. తిరుమల రామచంద్రగారిని వీరు విప్లవ కార్యక్రమాల్లో చేర్చుకున్నారు. పగటిపూట సంస్కృతాభ్యాసం, రాత్రిపూట విప్లవకార్యక్రమాలు-ఇదీ నెల్లూరులో రామచంద్రగారి జీవితం.

భగత్‌సింగ్‌ని ఉరితీసాక 1933 ఆగస్టునెలలో బ్రిటిష్ ప్రభుత్వం ఆయన సహచరుల్ని మద్రాసుకు తరలిస్తున్న దని సమాచారం వచ్చింది. తిరుమల రామచంద్రగారి విప్లవ మిత్రులు కావలి-బిట్రగుంట స్టేషన్లమధ్య భగత్‌సింగ్ సహచరుల్ని తప్పించాలని పథకం వేశారు. తిరుమల రామచంద్రగారి పని ఎవరైనా వస్తే నినాదాలివ్వడం. రామచంద్రగారి మిత్రులు ముందే రైలెక్కేశారు.తర్వాత గొలుసు లాగారు. రైలు ఆగింది. అధికారులు హడావుడిగా ట్రాకంతా తిరిగారు. తిరుమల రామచంద్రగారు ఓ చెట్టు గుబురులో రివాల్వర్‌తో వున్నారు. గంట తర్వాత రైలు కదిలింది. ఆ రైల్లో భగత్‌సింగ్ అనుచరుల్ని పోలీసులు తీసుకురానేలేదు. ప్రయత్నం వ్యర్థమైంది. ఇవికాక మరికొన్ని సంఘటనల్లో తిరుమల రామచంద్రగారు మిత్రులతో కలసి పాలు పంచుకున్నారు.వాటి ప్రభావం చాలా రోజుల తర్వాతగానీ ఆయనకు తెలిసిరాలేదు.

రామచంద్రగారి మాటల్లోనే చెప్పాలంటే నెల్లూరులో ఆయన జీవనయానం ద్వంద్వరీతిలో - రెండు పట్టాలపైన నడిచింది. పగలేమో పరమభాగవత వేషం. గూడకట్టుపంచ, ఉత్తరీయం,రెండుచేతుల్తో పట్టు కున్నా ఇమడని జుట్టుముడి, నొసట కొట్టవచ్చే ఊర్ధ్వత్రిపుండ్రాలు, రాత్రేమో రాత్రించర వేషం.

అడపాదడపా విప్లవ మిత్రులొచ్చి సత్రం దగ్గర చర్చలు జరిపేవారు. అంతా సంకేతభాష. అయితే తిరుమల రామచంద్రగారికి క్రమంగా ఈ మార్గం నచ్చలేదు. నువ్వు హింసామార్గంలో నడుస్తున్నావని అంతరాత్మ హెచ్చరించేది. గాంధీగారి అహింసామార్గం గుర్తుకొచ్చేది. దాంతో ఆయన నెల్లూరు వదిలేసి మద్రాసు చేరు కున్నాడు.

మద్రాసులోని సంస్కృత కళాశాలలో ప్రవేశం దొరికింది. హాస్టల్‌లో వసతి కూడా దొరికింది. కానీ భోజన సదుపాయం మాత్రం ఏర్పాటు కాలేదు. ఆ తర్వాత  చాలా ఏళ్ళ దాకా కూడా భోజనం సమస్య ఆయన్ని వేధించింది. హాస్టల్లో ఆయన సహాధ్యాయులు అన్నం మిగిల్చి వార్డెన్ వెళ్ళిపోయాక ఓ చెట్టు కింద రహస్యంగా తెచ్చి ఆయనకిచ్చేవారు. ఆ అన్నం ఆయన చేతుల్లో పెట్టుకుని తినేవాడు.

అలా అవస్థపడుతుండగా అనుకోకుండా ఉపద్రవం రానే వచ్చిపడింది. పార్థసారథి అయ్యంగార్ అనే సి.ఐ.డి ఇన్స్‌పెక్టర్ మఫ్టీలో వచ్చి తిరుమల రామచంద్రగారిని తన వెంట రమ్మన్నారు.రకరకాల ప్రశ్నలేసి పోలీస్ కమిషనర్ వైద్యనాథ మొదలియార్ ఎదుట హాజరు పరిచాడు. తిరుమల రామచంద్రగారు అంటీ ముట్టనట్టుగా సమాధానాలు చెప్పి వాళ్ళడుగుతున్న విషయాల గురించి తనకేమీ తెలియదనేశారు. అయితే ఆళ్ళ

బాలకృష్ణారెడ్డి, పట్టాభిరామిరెడ్డి వగైరా మిత్రులు తమకు పట్టుబడి పోయారని చెప్పి పోలీసులు మెత్తగానే తిరుమల రామచంద్రగారిని అప్రూవరుగా మారిపోయేందుకు రంగం సిద్ధం చేశారు. అది జరిగాక తిరమల రామచంద్రగారిని కళాశాల దగ్గర పి.రామమూర్తి అనే అడ్వకేట్ వచ్చి కలిసాడు. ఈ పి.రామమూర్తే ఆ తర్వాత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ నాయకుడూ, పార్లమెంటు సభ్యుడూ అయ్యాడు. తిరుమల రామచంద్రగారిని బచ్చు జగన్నాథదాసుగారనే సుప్రసిద్ధ న్యాయవాది దగ్గరికి రామమూర్తి తీసుకెళ్ళాడు. జగన్నాథ దాసుగారు టంగుటూరి ప్రకాశం పంతులు దగ్గర జూనియర్‌గా వుండేవారు. సాక్షాత్తు ప్రకాశం పంతులుగారే ఈ కేసు జరపడానికి పూనుకున్నారని చెప్పి కోర్టులో ఆ కేసు గురించి తనకేం తెలీదని చెప్పవలసిందిగా తిరుమల రామచంద్రగారిని అడిగారు దాసుగారు.

భగత్‌సింగ్ అనుచరుల్ని విడిపించడానికి విప్లవకారులు కుట్ర పన్నారనీ, అందులో తిరుమల రామ చంద్రగారు కూడా సభ్యులనీ పోలీసులు కేసు పెట్టరు. అదే మద్రాసు కుట్ర కేసు. దక్షిణ భారతదేశంలో అదే మొట్టమొదటి కుట్రకేసు. పత్రికలు ఈ కేసుకు చాలా ప్రాధాన్యతనిచ్చాయి. కేసు విచారణకు స్పెషల్ మేజిస్ట్రేటు కోర్టు ఏర్పాటైంది. 1933 సెప్టెంబరు 8 వతేదీన మద్రాసు కుట్ర కేసు విచారణ ప్రారంభమైంది.

టంగుటూరి ప్రకాశం పంతులుగారు డిఫెన్స్ తరపు న్యాయవాది. అప్పటికే ఆయన ప్రాక్టీసు వదులుకుని స్వాతంత్ర్య పోరాటంలో వున్నారు. ఈ కుట్రకేసు వాదించడానికి స్వయంగా పూనుకున్నారు. డిఫెన్స్ తరఫున ప్రకాశం పంతులుగారున్నారంటే ప్రాసిక్యూషన్ గడగడలాడేదని ప్రతీతి. ఆయన ఎప్పటిదో నల్లకోటు వద్దనుకున్నారు.ప్రాక్టీసులో సంపాయించినదంతా అప్పటికే పోగొట్టుకున్నారేమో, దుబ్బు జుట్టుకు నూనెరాసి దువ్వి ధోవతి, లాల్చీ, రంగువెలసిన ఖద్దరు శాలువాతోనే కోర్టుకొచ్చారు. ఆయన లేచి నిలబడుతూనే ప్రాసిక్యూషన్ మాత్రమే కాదు స్పెషల్ మేజిస్ట్రేటు కూడా తెల్ల మొహం వేసి ఛాంబర్లోకి వెళ్ళి దుస్తులు మార్చు కొచ్చాట్ట.

తిరుమల రామచంద్రగారిని ప్రకాశం పంతులుగారు క్రాసు పరీక్ష చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున సాక్షిగా నిలబడ్డ రామచంద్రగారు కేసుగురించి తనకేం తెలీదని ప్రాసిక్యూషన్‌కు ఎదురుసాక్ష్యం చెప్పారు. అయినా సరే, స్పెషల్ మేజిస్ట్రేటు ఇష్టం వచ్చినట్లు ముద్దాయిలకు శిక్షలు చెప్పాడు. జగన్నాథదాసుగారు హైకోర్టులో అప్పీలు వేశారు. అప్పీలులో శిక్ష తగ్గించగా ముకుంద్‌లాల్ సర్కార్ అనే ముద్దాయికి మాత్రం కాస్త ఎక్కువగా- అంటే, నాలుగేళ్ళు శిక్షపడింది. మిగతావారికి రెండేళ్ళు మాత్రం శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున సాక్షిగా వున్నందు వల్ల తిరుమల రామచంద్రగారు ఈ కేసులో ముద్దాయి కారు.

ఆ రోజు సాక్ష్యం చెప్పాక కోర్టునుంచి తిరిగి వచ్చేసరికి తిరుమల రామచంద్రగారి పరిస్థితి దిగజారింది. కుట్రకేసులో వున్నందువల్ల అప్పటికే దౌర్జన్యవాది అనీ, విప్లవకారుడనీ పత్రికలు ఆయన గురించి రాశాయి. దాంతో మద్రాసు సంస్కృత కళాశాల నుంచి ఆయన్ని తీసేసారు. ఎక్కడా తలదాచుకునే చోటు లేదు. 'భారతి'లో సబెడిటర్‌గా పనిచేస్తున్న తిరుమల వేంకటరంగాచార్యులు గారు బంధువు కాబట్టి ఆశ్రయమిచ్చారు.

కుట్రకేసు పూర్తయ్యాక తిరమల రామచంద్రగారు మద్రాసు వదలి తిరిగి బళ్ళారి వెళ్ళారు. అయితే కుట్రకేసు అక్కడికీ ఆయన్ని వెంబడించింది. ఓ కానిస్టేబుల్ ఆయన్ని గర్తించి పట్టుకెళ్ళి ఇన్‌స్పెక్టరు ముందు నిలబెట్టాడు. అయితే కానిస్టేబులుకు ఠకీమని కుట్రకేసనడం గుర్తుకురాలేదు. "అదేదో మద్రాసు మోటారు కేసు సార్. బడా

ఆసామి సార్. మన పోలీసోళ్ళను మాయ చేశాడు సార్" అన్నాడు. కుట్రకేసని వుంటే ఆ ఇన్‌స్పెక్టరు తప్పనిసరిగా ఏదో తప్పుడు కేసు బనాయించి రామచంద్రగారిని లోపలికి తోసేవాడేమో. కానిస్టేబుల్ మోటార్‌కేసని అవకతవగ్గా మాట్లాడ్డంతో తిరిమల రామచంద్రగారిని ఆ ఇన్‌స్పెక్టర్ వదిలేశాడు. ఇక స్వస్థలానికి తిరిగి వెళ్ళాలనే ఆలోచనకు స్వస్తి చెప్పి తిరుమల రామచంద్రగారు మళ్ళీ మద్రాసు చేరుకున్నారు. అక్కడ కోమల అనే బంధువు ముప్పై రూపాయలు సాయం చేయడంతో పరశువాకంలో రెండున్నర రూపాయలకు గది అద్దెకు తీసు కున్నారు.

ఏం చేయాలనేది అగమ్యగోచరంగా వుంది. అంతలో మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భండాగారంలో అను కోకుండా వ్రాయసగాడి పని దొరికింది. అక్కడే ఆయనకు బులుసు వెంకటరమణయ్యగారితోనూ, వేటూరి ప్రభాకర శాస్త్రిగారితోనూ పరిచయం కలిగింది. వేటూరి ప్రభాకరశాస్త్రితో పరిచయం ఆత్మీయానుబంధం ఏర్పడేంత దూరం వెళ్ళింది. తిరుమల రామచంద్రగారిని ప్రేమగా 'వీరభద్రాచార్లూ' అని పిలిచేవారు ప్రభాకర శాస్త్రిగారు.

హంపీ నుంచి హరప్పా దాక పుస్తకంలో తిరుమల రామచంద్రగారు అనేక మంది సుప్రసిద్ధ వ్యక్తుల్ని- మనమిప్పుడు కేవలం పేర్లు మాత్రమే విన్న వాళ్ళని సజీవంగా నిరూపణం చేసి చూపిస్తారు. వారిలో వేటూరి ప్రభాకరశాస్త్రిగారిని గురించి చెప్పినట్లు మరెవరి గురించీ అంత ఆత్మీయంగా చెప్పలేదేమో. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు సుప్రసిద్ధ పరిశోధకులు. అప్పటికే ఆయన శివకవుల మీద 'భారతి'లో రాస్తున్న వ్యాసం చర్చనీయాంశమైంది. తెలుగు వారికి వేటూరి ప్రభాకర శాస్త్రిగారిచ్చిన గొప్ప కానుక అన్నమయ్య పదాలను వెలికి తీయడం. దాని గురించి తిరుమల రామచంద్రగారు తమ పుస్తకంలో ఏమీ చెప్పలేదుగానీ, ప్రభాకర శాస్త్రిగారిని గురించి మాత్రం పుష్కలంగా చెప్పారు.

మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో తిరుమల రామచంద్రగారు కుదుర్చుకున్న పని కాంట్రాక్టు పద్ధతి మీద చూచిరాత రాయడం. వంద అనుష్టుప్ శ్లోకాలకు అయిదు రూపాయలు రాతకూలీ. ఆ సమయంలో పక్కింటి రుక్మిణి అనే చిన్న పిల్ల చెప్పిన మాట మీద పొడవాటి జుట్టు తీయించేసి క్రాపింగు పెట్టుకున్నారు. తీరా జుట్టు తీయించాక దాని గురించి తర్జన భర్జన. జుట్టున్న వాళ్ళంతా సాంప్రదాయకులూ కారు, ఆధునిక వేషంలో వున్నవారు ఆధునికులూ కారుగా అని మనసుకు సమాధానం చెప్పకోవడం. అలాంటి వాళ్ళు కడుపులో పిలకున్నవాళ్ళని నవ్వుకోవడం.

ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో మొదట్లో వేటూరి ప్రభాకరశాస్త్రిగారినుంచి తిరుమల రామచంద్రగారికి ప్రసన్నత ఎదురుకాలేదు. ప్రభాకరశాస్త్రిగారు పూర్తిగా గాంధేయవాదులుగనుక దౌర్జన్యవాదిగా ముద్రపడ్డ తిరుమల రామచంద్రగారి పట్ల అప్రసన్నంగా వున్నారు. రెండునెలలు రామచంద్రగారిని అబ్జర్వేషన్లో పెట్టాక సన్నిహితులైపోయారు.

ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో రాతపనితోపాటు ప్రాచీన గ్రంథాలు బాగా చదివే అవకాశం వచ్చింది. రామచంద్రగారది వృథాపోనీయలేదు. వేటూరి ప్రభాకరశాస్త్రిగారి చాటుపద్య మణిమంజరి రెండో భాగం కోసం రామచంద్రగారనేక చాటువులు సేకరించారు. అవెలా దొరుకుతాయో ప్రభాకరశాస్త్రిగారే చెప్పారు- "తెలుగు తాళపత్రగ్రంథాల్లో అక్కడక్కడా లేఖకులు వ్రాసిన చాటుపద్యాలు ఉంటాయి. వాటిని చూచి వ్రాసినట్టు", అని.

చాటు పద్యాలకోసం తాటాకుపుస్తకాలు గాలిస్తుండగా పండితారాధ్యుల 'శివతత్త్వసారం' కన్నడానువాదం దొరకడంతో పండితారాధ్యుడు కన్నడంలో కూడా సిద్ధహస్తుడనే విషయం బయటపడింది. పాఠపరిష్కరణ జోరుగా సాగేది. అదే సందర్భంగా ప్రభాకర శాస్త్రిగారు హరవిలాసానికి పాఠాంతరాలు సేకరించుకు రమ్మని తిరుమల రామచంద్రగారిని తంజావూరు సరస్వతీ మహల్ గ్రంథాలయానికి పంపించారు. రామచంద్రగారు పాఠాంతరాలు మక్కికి మక్కి సేకరించుకొచ్చారు. ఒకచోట "అవంచియే కంచి నీకు అడుగామడాయే" అని ఓ గీత పద్యపాదం కొరకరాని కొయ్యలా తగిలింది. ప్రభాకరశాస్త్రిగారు అరగంటసేపు ఆలోచించి రామచంద్రగారిని ప్రాచీన మహానగరాల పేర్లు చెప్పమన్నారు. రామచంద్రగారు వెంటనే అప్పజెప్పారు. "ఇంకేం, పాఠం సవరించు", అన్నారు శాస్త్రిగారు. రామచంద్రగారు నివ్వెరపోయి, "అవంతియే కంచి నీకు",అని పాఠం సవరించారు. పాఠం సవరించడమే కాదు, అవంతి అవంచి ఎలా అయ్యిందో కూడా విడమర్చి చెప్పారు ప్రభాకరశాస్త్రిగారు. కంచికి కాంతి అనే రూపాంతరం వున్నది. కాంతి కంచి ఎలాగైందో అవంతి అవంచి అలాగే అయ్యుండాలన్నారు. ప్రభాకర శాస్త్రిగారి పాఠ పరిష్కారం ఎంత హృద్యంగా సాగేదో, పాఠాంతరాల సేకరణ కోసం ఎంత శ్రమ తీసుకునేవారో, వారి పరిష్కరణలు ప్రామాణికాలు ఎలాగైనాయో దీన్ని బట్టి బాగా తెలుస్తుంది.

ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో పనిచేస్తున్న కాలంలో తిరుమల రామచంద్రగారికి దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారి సందర్శనం జరిగింది. అలాగే ఆంధ్రవిశ్వవిద్యాలయం కళాశాల ప్రిన్సిపాల్ విస్సా అప్పారావుగారితోనూ పరిచయం ఏర్పడింది. అది తంజావూరు సరస్వతీమహల్ గ్రంథాలయంలో గ్రంథ పరిశీలనా పండితుడిగా సంవత్సరకాలపు ఉద్యోగానికి దారితీసింది. తంజావూరులో మాతృభాషను కాపాడుకుంటున్న తెలుగువారిని చూసి ముగ్ధులయ్యారు రామచంద్రగారు. తమిళనాడులో వుంటున్న తెలుగు వాళ్ళు మాట్లాడేది తరతరాలుగా కాపాడుకుంటూ వస్తున్న ప్రాచీన తెలుగుభాషేనని గుర్తించారు.

తంజావూరి సరస్వతీమహల్ గ్రంథాలయంలో పనిచేస్తున్న సమయంలో తిరుమల రామచంద్రగారికి లాహోర్‌లో దక్షిణ భారత లిపి తెలిసిన పండితుడిగా ఉద్యోగం వచ్చింది. లాహోర్ వెళ్ళడానికి ముందు రామ చంద్రగారు మద్రాసులో కొద్దిరోజులు మళ్ళీ ప్రభాకరశాస్త్రిగారికి దగ్గరగా వుండే అవకాశం వచ్చింది. అదే సమయంలో నేతాజీ సుభాస్ చంద్రబోస్ మద్రాసురావడం, మెరీనాబీచ్‌లో బ్రహ్మాండమైన సభలో ప్రసంగించడం జరిగింది. త్వరలో రెండో ప్రపంచయుద్ధం రాబోతున్నదనీ, భారతీయులు దానికి సహకరించ రాదనీ, త్వరలో స్వరాజ్యం సిద్ధిస్తుందనీ నేతాజీ ప్రసంగించారు. సభకు పదిలక్షలమందికి పైగా వచ్చారు జనం. తిరుమల రామచంద్రగారా సభకు వేటూరి ప్రభాకరశాస్త్రిగారి పిల్లల్ని పిల్చుకెళ్ళారు.

గాంధీజీని ఎదిరించిన సుభాస్ చంద్రబోసంటే ప్రభారశాస్త్రిగారికి గిట్టదు. అంతకుముందు జరిగిన అఖిలభారతీయకాంగ్రెస్ అధ్యక్ష పదవి ఎన్నికల్లో గాంధీగారు బలపరిచిన పట్టాభి సీతారామయ్యగారు ఓడిపోయి సుభాస్ చంద్రబోస్ గెలిచారు. పట్టాభి సీతారామయ్యగారి ఓటమి తన ఓటమిగా గాంధీగారు ప్రకటించారు. సుభాస్ చంద్రబోస్ సభకు తన పిల్లల్ని పిల్చుకెళ్ళారనగానే వేటూరి ప్రభాకరశాస్త్రిగారికి ఆగ్రహం కట్టలు తెంచుకుంది. తిరుమల రామచంద్రగారిపైన విరుచుకుపడ్డారు. గంటసేపు గడిచిపోయినా ఆయన కోపం తగ్గే సూచన కనిపించలేదు. ఆ కోపానికి తట్టుకోలేని తిరుమల రామచంద్రగారు దిమ్మెరపాటుతో అక్కడ్నించి తమ బసకు వెళ్ళిపోయారు. అయితే ఆ తర్వాత ప్రభాకరశాస్త్రిగారు పరిగెత్తుకుంటూ

రామచంద్రగారిని కౌగలించుకుని తమ కోపానికి పశ్చాత్తాపంతో కన్నీరు కారుస్తుండిపోయారు. తనదే తప్పని ఒప్పకుని ఆ ఉద్వేగం కాస్త సద్దు మణిగాక, " వీరభద్రాచార్లూ! వీపు దురదగా వుంది. కాస్త గోకవయ్యా",అని అక్కడున్నవారిని  ఆశ్చర్యపరిచార్ట.

1939 ఆగస్టు 31 వ తేదీన తిరుమల రామచంద్రగారు లాహోర్ స్టేషన్లో దిగారు. ఉద్యానవనాలతో అలరారుతూ లావణ్యం వొలికే లాహోర్. అక్కడ దిగుతూనే అనుకోకుండా అదివరకు ప్రభాకరశాస్త్రిగారితో చర్చించిన ఓ సంస్కృత శ్లోకానికి ప్రత్యక్షంగా అర్థం తెలుసుకునే అవకాశం కలిగింది. "తరుణం సర్షపశాకం" అంటే లేత ఆవవేసిన కూర అని ప్రభాకరశాస్త్రిగారూ, కాదు లేత ఆవకూరేనని తిరుమల రామచంద్రగారూ మునుపోసారి వాదించుకున్నారు. లేత  ఆవ వేసి పొగిచిన కూర అని ప్రభాకరశాస్త్రిగారు నొక్కి చెప్పడంతో రామచంద్రగారు అప్పటికి నోరెత్తలేదు. లాహోర్లో దిగుతూనే 'సర్సోంకాసాగ్' అనే పేరుతో సర్షపశాకం భోజనపదార్థంగా ప్రత్యక్షమైంది. అక్కడివారు కూరలో ఆవకూరవేసి కాదు, ఆవకూరనే నేరుగా తింటున్నారు. రామచంద్రగారు వెంటనే రెండు ఆవకూర పోచలు తెప్పించి సర్షపశాకం అంటే ఆవవేసిన కూర కాదనీ, లేత ఆవకూరనీ, లాహోర్లో ఆవాకు తింటారనీ పోచల్తోపాటు ప్రభాకరశాస్త్రిగారికి వుత్తరం రాసి పోస్టు చేశారు. తాను అనుకోకుండా కనుక్కున్న విషయం రాసి పంపేదాక ఆయనకు ఉబలాటం తగ్గలేదు.

లాహోర్ ప్రస్తుతం పాకిస్తాన్లో వుంది కాబట్టి ఇప్పటి మన దక్షిణాదివారికి లాహోర్గురించి తెలిసింది తక్కువ, లాహోర్లో చలి విపరీతంగా వుంటుంది, అక్కడి ప్రజలు స్నేహప్రియులు. ఉద్యాన వనాలను ప్రేమిస్తారు. ఆయా ఋతువులకు అనుగుణంగా పచ్చి కూరగాయలు తింటారు. దేన్నైనా తేలిగ్గా తీసుకునే డోన్ట్కేర్ మనుషులు. అయితే బంధువులెవరైనా చనిపోతే మాత్రం అతి భయంకరంగా ఏడుస్తారు. రాయచంద్రగారు వెళ్ళేనాటికి అక్కడ చాలామంది తెలుగువాళ్ళు ఉద్యోగాలు చేసుకుంటున్నారు.

లాహోర్లో తిరుమల రామచంద్రగారు ఉర్దూ మహాకవి ఇక్బాల్ని చూశారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రసంగం విన్నారు. మలయాళ మహాకవి వల్లత్తోళ్ కథాకళి బృందంతో వచ్చినప్పడు లాహోర్ ప్రజలు పట్టు తాపితాలు పరిచి స్వాగతం చెప్పారు. ఆ సమయంలో విదేశాల్లో బ్రిటీష్ కమిషనర్గా వున్న సర్ ఫిరోజ్ఖాన్ నూన్ రెండో ప్రపంచయుద్ధం తర్వాత భారతదేశం స్వతంత్ర దేశమవుతుందనీ, విచ్ఛిన్నం అవుతుందనీ హిందూ మెజారిటీ గల లాహోర్ నగరాన్ని ముస్లిం మెజారిటీగా మార్చాలని అక్కడి మునిసిపాలిటీని రద్దు చేయించాట్ట. పాకిస్తాన్కు అప్పడే పునాదులు పడ్డాయంటారు రామచంద్రగారు.

లాహోర్ పని పూర్తయిపోయినా తిరుమల రామచంద్రగారికి ఆ నగరం వదిలి రాబుద్ధి పుట్టలేదు. అప్పడే ఆనంద్ అని ఓ తాయెత్తు మంత్రగాడు తారసపడ్డాడు. అరవైరూపాయల నెలసరి జీతానికి అతని దగ్గర గుమాస్తాగా కుదురుకున్నారు రామచంద్రగారు. అక్కడా లేఖకుడి పనే. అక్కడ కొద్ది రోజులు పనిచేసి అతను చేసే మోసాలు, టక్కులు చూడలేక హిందీ ఉపాధ్యాయుడిగా వేరే ఉద్యోగం వెతుక్కుని వెళ్ళిపోయారు. అయితే ఆ ఉద్యోగంలోనూ మూడునెలల కంటే ఎక్కువ వుండలేకపోయారు. లాహోర్ సనాతనధర్మకళాశాలలో సంస్కృతాచార్యుడిగా పనిచేస్తున్న డాక్టర్ రఘువీర తానొక ప్రపంచభాషా నిఘంటువు తయారు చేస్తున్నాననీ, నిఘంటుకార్యాలయంలో చేరమనీ చెప్పినా రామచంద్రగారు వినిపించుకోలేదు. తిరుమల రామచంద్రగారు అనంతరకాలంలో పశ్చాత్తాపపడిన సంఘటనల్లో అదొకటి.

1941 లో సోవియట్ యూనియన్ రెండో ప్రపంచ యుద్ధంలో దిగింది. మిత్రుల యుద్ధం కాబట్టి భారత ప్రజలు సోవియట్ యూనియన్‌కు తోడ్పడాలని కమ్యూనిస్టు పార్టీ వారు నినదించడంతో తిరుమల రామ చంద్రగారు మిలటరీలో హవాల్దారు క్లర్కుగాచేరారు. ఆ మార్నాడే ఆయన్ని శిక్షణ కోసం బెలుచిస్తాన్‌లోని క్వెట్టాకు పంపించారు. ఈ ప్రాంతం ఇప్పుడు పాకిస్తాన్‌లో వుంది. క్వెట్టాలో మూడు నెలల శిక్షణ తర్వాత అక్కడికి ఎనభై మైళ్ళ దూరంలో ఉన్న చమన్ అనే సైనిక కేంద్రానికి పంపారు. అక్కడ కొన్నాళ్ళు గూర్ఖా బెటాలియన్‌లో పనిచేశాక మిలటరీ ఆసుపత్రిలో మాస్టర్‌గా వేశారు. యుద్ధం తీవ్రం కావడంతో క్వెట్టా ప్రాంతాన్ని యుద్ధరంగంగా ప్రకటించే యోచనలు ప్రారంభమైనాయి. అంతలో ఎవరో అత్యున్నత బ్రిటిష్ నాయకుడు హఠాత్తుగా తనిఖీకి వస్తున్నాడనీ, అందుకు సిద్ధంగా వుండాలనీ హెచ్చరించారు. ఆ మార్నాడు జరిగిన పెరేడ్‌లో కనిపించిన నాయకుడిని ఎక్కడో చూసిన మొహంలా వుందే అనుకుంటూ తేరిపార చూసేసరికి రామచంద్ర గారు అదిరిపడ్డారు. ఆ నాయకుడు మరెవరో కాదు - సాక్షాత్తు బ్రిటిష్ ప్రధానమంత్రి చర్చిల్. క్వెట్టాను యుద్ధరంగంగా ప్రకటించే యోచన వుండడంతో స్వయంగా చర్చిల్ రహస్యంగా అక్కడికొచ్చి సైనికులకు ధైర్యం నూరిపోసాడు. అలా అనుకోకుండా తిరుమల రామచంద్రగారికి చర్చిల్‌ని దగ్గరగా చూసే అవకాశం వచ్చింది.

చమన్‌లో అచ్చర్ సింగ్ అని బతికి చెడ్డ సర్దార్‌జీ వుండేవాడు. అతని పరిస్థితికి జాలిపడి డేరాలో మిగిలిపోయిన గోధుమపిండి తీసుకుపొమ్మన్నారు రామచంద్రగారు. అది అనుకోని ఉపద్రవానికి దారితీసింది. నిజానికా పిండిని బెటాలియన్ ఖాతాకు చేర్చాలి. పరోపకారానికి చేసిన పని రామచంద్రగారి ప్రాణాల మీదికి తెచ్చింది. కోర్టు మార్షల్ ఎదురైంది. అయితే కర్నల్‌గారి ఔదార్యంతో అపాయం తప్పింది.

కోర్టు మార్షల్ తర్వాత మిలటరీ జీవితం ఛీ అనిపించి వదిలించుకోదల్చుకున్నారు. బెటాలియన్‌లో కడప వెంకటకృష్ణ అనే తెలుగు డాక్టర్ వుండేవాడు. ఆయన్ని సంప్రదించి తనకు మతిమరుపు ఎక్కువకావడం వల్ల సైన్యానికి నష్టమని ఓ నివేదిక రాయించుకుని చెప్పా పెట్టకుండా మిలటరీని వదిలేసి లాహోర్‌కు టిక్కెట్టు కొని బయల్దేరారు.

రోహ్రీ జంక్షన్‌లో ఓ చరిత్ర విద్యార్థి పరిచయమయ్యాడు. మొహంజొదారో తప్పకుండా చూడమని అతను సలహా ఇచ్చాడు. 1922 ప్రాంతం నుంచి మొహంజొదడో, హరప్పాలలో జరిగిన తవ్వకాల గురించి చదివి వుండటంతో లాహోర్ ప్రయాణం మానుకుని తిరుమల రామచంద్రగారు సింధ్‌లోని హైదరాబాద్‌కు మళ్ళారు. అక్కడ సింధు నదిలో స్నానం చేసి బస్సులో మొహంజొదడోకు బయల్దేరారు.

మొహంజొదడో ఆంగ్లోచ్చారణలో మొహంజొదారో అనే పేరుతో ప్రఖ్యాతి చెందింది. ఈ ప్రాచీన శిథిలాలను అక్కడివారు మొ ఎన్-జో-దడో అని వ్యవహరిస్తారు. తిరుమల రామచంద్రగారు దీని అర్థం వివరిస్తారు. మొ ఎన్ అంటే 'మృతుల', దడో అంటే తటం లేదా గట్టు - వెరసి మృతుల దిబ్బ. మొదట్లో దీని ప్రాశస్త్యం తెలీక స్థానికులు పీనుగుల దిబ్బగా పిలవడంతో దానికా పేరొచ్చింది. అది ఇప్పటి పాకిస్తాన్‌లోని సింధ్ రాష్ట్రంలో లార్‌కానా జిల్లాలో లార్‌కానా పట్టణానికి పదిహేను మైళ్ళ దూరంలో సింధునది ఒడ్డున వుంది. తిరుమల రామ చంద్రగారు ఒక రోజంతా అక్కడ ఉండి ఇప్పుడు ప్రపంచ ప్రఖ్యాతి చెందిన నాణేలు ఇంకా ఇతరత్రా ఆ చరిత్ర పూర్వ యుగం నాటి సామగ్రి చూశారు. తర్వాత అక్కడ నుంచి హరప్పాకు బయల్దేరారు.

లాహోర్-ముల్తాన్ రైలు మార్గంలో షాహీవాల్ - చించి వాట్నీ స్టేషన్ల మధ్య వుంది హరప్పా. పాకిస్తాన్‌లోని పంజాబ్ రాష్ట్రంలో మాంటుగోమరీ జిల్లాలో రావీనది ఎడమగట్టున వుంది. స్థానికులు ఈ ప్రదేశాన్ని 'హడప్పా' అంటారు. అంటే మింగేయడం. రావీనది ఈ వూరిని పొట్టన పెట్టుకోవడం వల్ల దానికా పేరు వచ్చి వుంటుందని తిరుమల రామచంద్రగారి అభిప్రాయం.

హరప్పా నాగరికత మీద తిరుమల రామచంద్రగారు కొన్ని అభిప్రాయాలు వ్యక్తం చేసారు. ఇక్కడ దొరికిన లిపి నుంచి బ్రాహ్మీలిపి పుట్టి వుంటుందని ఆయన ఊహ. గంగడోలు భూమి వరకు ఉన్న జంతువులు వృషభాలో, ఆవులో అని భావించారు. అయితే సింధులోయ ముద్రికల మీద వున్న బొమ్మల విషయంలో ఇటీవల పత్రికల్లో పెద్ద రాద్ధాంతం జరిగింది. అవి ఆర్య నాగరికతను సూచించే బొమ్మలని తేల్చడానికి కొందరు చాలా ప్రయాసపడ్డారు. అయితే శాస్త్రీయమైన చారిత్రక పరిశోధనలో ఇది ఆర్యేతర నాగరికత అని తేల్చడం జరిగింది. తిరుమల రామచంద్రగారు కూడా ఇది ఆర్య -ఆర్యేతర సంస్కృతుల సమ్మేళనం కావచ్చని అభిప్రాయపడతారు.

హరప్పానుంచి బయల్దేరాక రఘునాథ్‌సింగ్ అనే దార్లో దొరకిన మిత్రుడు తిరుమల రామచంద్రగారిని బాగా డబ్బు సాంపాయించడానికి నేపాల్ వెళ్దామని సూచించాడు. తిరుమల రామచంద్రగారు ఆ ప్రలోభంలో పడిపోయారు. రఘునాథ్ సింగ్ ఆయన్ని కాన్పూర్ దగ్గర గంగానదీ తీరానికి తీసుకెళ్ళాడు. గంగలో స్నానం చేశాక రఘునాథ్‌సింగ్ ఆయన్నక్కడే వదిలేసి అయిపులేకుండా పోయాడు. ముప్పైరోజుల పాటు అన్నమూ నీళ్ళూ లేక అతనికోసం ఎదురు చూస్తూ కూర్చున్నారట తిరుమల రామచంద్రగారు. ఆ తర్వాత అక్కడా ఇక్కడా ఉద్యోగాలు చేసి ఢిల్లీ వచ్చి పడ్డారు. అక్కడ 'డెయిలీ టెలిగ్రాఫ్' పత్రికలో ఉద్యోగం దొరికింది. ఆ సమయంలోనే రాహుల్ సాంకృత్యాయన్ ప్రసంగించిన సభావిశేషాలను ఆ పత్రిక కోసం కవర్ చేశారు. పత్రికారచన తమకు బాగా సరిపడిందని నిర్ణయించుకుని డెయిలీ టెలిగ్రాఫ్ వదిలేసి ఏదైనా తెలుగు పత్రికలో చేరడానికి మన దక్కన్ హైదరాబాద్ చేరుకున్నారు. అంతటితో పుస్తకం ముగుస్తుంది.

'హంపీ నుంచి హరప్పా దాక' ఒక మనిషి జీవిత ట్రావెలాగ్. అసాధారణ వ్యక్తిగా అందలమెక్కాల్సిన మనిషి సాధారణ వ్యక్తిగా మిగిలిపోవడానికే ఇష్టపడ్డం ఈ పుస్తకంలో మనం చూస్తాం. ఆనాటి కాంగ్రెస్ పార్టీలో మిత్రులు కోరినట్టు కొనసాగి వుంటే రాజకీయాల్లో చాలా పైకి వచ్చి వుండేవారేమో.

కాంగ్రెస్ వాదిగా వున్నప్పుడు తెగువతో జైలుకు వెళ్ళగలిగిన మనిషి ఆ తర్వాత పోలీసువాళ్ళు తన వెంట పడినందుకే అల్లాడిపోయిన వైనం ఆశ్చర్యం కలిగిస్తుంది. అందుకు కారణం అర్థం చేసుకోవడం పెద్ద కష్టమేం కాదు. విప్లవకారుడుగా కొనసాగడం తిరుమల రామచంద్రగారికి లోలోపల ఇష్టం లేకపోయింది. దానివల్ల లభించే జైలు, కష్టాలు అదివరకటిలా ఆయన్ని ఆకట్టుకోలేదు.మద్రాసు కుట్రకేసు పూర్తయ్యాక స్వాతంత్ర్య పోరాటం ఏడెనిమిదేళ్ళు సాగింది. అయినా తిరుమల రామచంద్రగారందులో ప్రత్యక్షంగా పాల్గొనడానికి ఏ మాత్రం ప్రయత్నించకపోవడం గమనార్హం. మద్రాసు కుట్రకేసు క్రియాశీల రాజకీయాలపట్ల ఆయన ఆసక్తిని చంపేసింది. ఆ తర్వాత ఆయన దేశసేవకుడిగా కాక భాషా సేవకుడిగా రూపాంతరం చెందడం ఈ పరిణామక్రమంలో భాగమే. 'హంపీ నుంచి హరప్పా దాక' పుస్తకంలో అడుగడుగునా సంస్కృత, ప్రాకృత శ్లోకాలు ఎదురవుతాయి. ఒక్క తెలుగు పద్యం కూడా ఈయన ఉదహరించలేదు. తిరుమల రామచంద్రగారిలోని మరో ద్వైధీ భావమేమిటంటే అంతరాంతరాల్లో ఆధునికులుగా పరిణతి చెందుతూనే పూర్తిగా సాంప్రదాయికుల

వేలుపట్టి నడవడం. తనని తాను నాస్తికుడిగా నిరూపించుకుంటూనే వేటూరి ప్రభాకర శాస్త్రిగారి ప్రేతాత్మల గొడవ నమ్ముతున్నాననడం, తన జీవితంలోని సంఘటనలను జాతకాలతో సరిపోల్చడం. సాహిత్యంలో కూడా ఆయన పూర్తిగా సంప్రదాయసాహిత్యాన్ని అభిమానించడమే కనిపిస్తుందిగానీ ఆధునికులెవర్నీ పేరుకైనా స్మరించకపోవడం లోపమేననిపిస్తుంది. ఏది ఏమైనా ఆయన గొప్ప వినయశీలి. ఎదుటివారిని గౌరవించే పనిలో తనను తాను మర్చిపోవడంతో ఆయనకు సొంతంగా వున్న ఆధునికభావాలు వికసించలేక పోయాయేమో. ఆయన భాష శిష్టవ్యావహారికమే. అయినా కథనం ఆధునికం. మొదలుపడితే చివరిదాకా చవులూరేలా చదివిస్తుంది.

అంతటి వినయశీలి రెండు సందర్భాల్లో సంయమం కోల్పోవడం కూడా ఆశ్చర్యం కలిగిస్తుంది. 53వ ప్రకరణంలో డాక్టర్ ఖురైషీగారింట్లో ఆతిథ్యం తీసుకోవడంలో మాధవశాస్త్రిగారి భండారీగారి ఔదార్యమేమిటో బోధపడదు. గోమయంలో ఇల్లలకమనడమేగాక బ్రాహ్మణుడు వండిన ప్రతి వేడిపదార్థంలో చుక్క మూత్రం ప్రోక్షించమనడం, భండారీగారికోసం డాక్టర్ ఖురైషీ తమ ఆభిజాత్యాన్నంతా పక్కకు పెట్టి అవన్నీ చేయించడం - ఖురైషీ గారి ఔదార్యం లెక్కలోకి కూడా రాలేదు. పైగా డాక్టర్ ఖురైషీని గోహంతకుడని పరిహసించడం- ఎంత పాపం శమించుగాక అనుకున్నా - అది తిరుమల రామచంద్రగారి పద్ధతికి విరుద్ధంగా కనిపించక మానదు.

అలాగే అనార్కలీ కథ చెబుతూ 'నికమ్మా సలీం' అని ఒకసారి కాదు, రెండుసార్లు బ్యాలెన్స్ తప్పడం కూడా విడ్డూరంగానే వుంటుంది. సలీం మీద ఎంత కోపం వున్నా ఇలా మోటు తిట్లకు తిరుక్కోవడం ఆయన వినయశీలతకు భంగమే. తనను కష్టపెట్టినవారిని - చివరికి తనను కోర్టు మార్షల్‌కు గురి చేసిన జోషీని సైతం పరుషంగా చిన్నమాట కూడా అనని తిరుమల రామచంద్రగారు ఇలా ఎందుకు చేశారా అనిపిస్తుంది. అయితే పుస్తకం ప్రాశస్త్యాన్ని బట్టి చూస్తే ఇవన్నీ చిన్న విషయాలే - సర్దుకుపోవచ్చు.

ఎంత శిష్టవ్యావహారికం వాడినా భాష విషయంలో వీలున్నప్పుడల్లా రాయలసీమ నుడికారాలు వాడ్డం హృద్యంగా వుంటుంది. గత పదేళ్ళ కాలంలో తెలుగులో వచ్చిన కొత్త పుస్తకాల్లో 'హంపీ నించి హరప్పా దాక' ఎన్నదగిన పుస్తకం. తెలుగు వాడెవరైనా సరే చదివి తీరాల్సిన పుస్తకం.

తన జీవితాన్ని పూర్తిగా సాహిత్య సేవకే వెచ్చించిన తిరుమల రామచంద్ర గారి యీ పుస్తకానికి ఆయన మరణానంతరం అవార్డు నివ్వడం ద్వారా కేంద్ర సాహిత్య అకాడమీ తన రుణాన్ని కొంతలో కొంతయినా తీర్చుకునే ప్రయత్నం చేసింది.

back to book of the week home page